అబ్దుల్‌నాగారంలో భూమి పూజలో పాల్గొన్న స్థానికులు

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

తరిగొప్పుల, ఫిబ్రవరి 23 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మండలంలోని అబ్దుల్‌నాగారంలో ప్రతిష్ఠించేందుకు ఆదివారం దళిత సంఘాల నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, గిరిజన, బలహీనవర్గాలు, మైనార్టీల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో అంబేద్కర్ రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. మహనీయుడి కృషితోనే బడుగు, బలహీనవర్గాలు సమాజంలో మేలు జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అర్జుల సంపత్ రెడ్డి, నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్ గౌడ్, అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు ఖాతా బాలయ్య, చింతల ఎల్లయ్య, రమేశ్, బాబు, ఖాతా సందీప్, మూల మహేశ్, నీల సంపత్, మూల అనందరం తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 23: కాపురానికి రావడం లేదని భార్యను, అడ్డువచ్చిన అత్తామామపై విక్షణారహితంగా దాడి చేసిన కోట చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కోట చంద్రశేఖర్ పెయింటింగ్, రాడ్ వైండింగ్ పనులు చేస్తూ శంబునిపేట ఎస్సీకాలనీలో ఉంటున్నాడు. ఈ క్రమంలో 2022లో పల్లవిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి బాబు జన్మించాడు. కొంత కాలంగా చంద్రశేఖర్ మద్యానికి బానిసకావడంతో వాసవీ కాలనీలోని తన తల్లిదండ్రుల వద్ద పల్లవి ఉంటున్నది. కాపురానికి రావడం లేదని, మరో వ్యక్తితో చనువుగా ఉంటున్నదనే అనుమానంతో ఈ నెల 29న భార్య పల్లవిపై కత్తితో దాడి చేయగా, అడ్డుకోబోయిన మామ జన్ను బాబు, అత్తపై దాడి చేసి పరారయ్యాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని పాపయ్యపేట చమన్ వద్ద అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సీఐ టి.గోపి, ఎస్సై సాంబయ్య, విఠల్, క్రైం సిబ్బంది విజయ్‌కాంత్, నాగేశ్వర్‌రావును అభినందించారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

నిట్‌లో ముగిసిన ఇంటర్ నిట్ క్రీడాపోటీలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 23: నిట్‌లో ఇంటర్ నిట్ క్రీడాపోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా క్రీడల కోసం ఇంటర్ నిట్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ నిట్‌ల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ ప్రదర్శించారు. ఆటగాళ్ల కృషి, క్రీడా స్ఫూర్తి, జట్టు తత్వాన్ని ఈ పోటీలు మరింతగా ప్రోత్సహించాయి. కాగా, హ్యాండ్‌బాల్ పురుషుల విభాగంలో విజేతగా వరంగల్ నిట్ జట్టు, రన్నరప్‌గా నిట్ సురత్కల్, మహిళల విభాగంలో విజేత నిట్ రాయ్‌పూర్, రన్నరప్‌గా నిట్ త్రిచి, వాలీబాల్ పురుషుల విభాగంలో విజేతగా నిట్ కాలికట్ జట్టు, రన్నరప్‌గా నిట్ త్రిచి, మహిళల విభాగంలో విజేతగా నిట్ సురత్కల్, రన్నరప్ నిట్ కురుక్షేత్ర, యోగా పురుషుల విభాగంలో విజేతగా నిట్ రాయ్‌పూర్, రన్నరప్‌గా నిట్ జంషెడ్‌పూర్, మహిళల విభాగంలో విజేతగా నిట్ జంషెడ్‌పూర్, రన్నరప్‌గా నిట్ కాలికట్ నిలిచారు. ముఖ్యఅతిథిగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి హాజరై విజేతలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Hema Motors needs Sales Executive: any Degree 2 wheeler must, Accountant: good Knowledge in Tally must and Min 1 to 2 Yrs of Exp in Automobile Dealership Walk in Interview with resume on 24th & 25th Feb 2025 between 11 am to 6.pm Cont: Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Wgl, Cell: 8008204442, 9154921942.

NTW-15465

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బావిలో పడి వ్యక్తి మృతి

ధర్మసాగర్, ఫిబ్రవరి 23: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు బొడ్డు ఎలీయ తనకు ఉన్న మేకలు మేపుతూ జీవిస్తున్నాడు. ఆదివారం ఓ బావి వద్ద గడ్డి ఉండటంతో మేకలను తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఓ మేక జారీ బావిలో పడుతుండగా దాన్ని రక్షించే క్రమంలో జారి అందులో పడిపోయాడు. బావిలో నీళ్లు ఉండగా మునిగి ఈత రాక మృతిచెందాడు. మృతదేహం కోసం స్థానికులు బావిలోని నీటిని తోడేస్తున్నారు. రాత్రి కావడంతో అందరూ వెనుదిరిగారు.

మద్యం షాపుల సిండికేట్

- ఐబీ బ్రాండ్ కొరత సృష్టించి బెల్ట్‌షాపులకు తరలింపు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

పాలకుర్తి, ఫిబ్రవరి 23: విత్తనాలు, యూరియా కొరత చూశాం.. అప్పుడప్పుడు మార్కెట్‌లో ఉల్లిగడ్డ నిల్వ లేక ధరలు పెరగడం చూశాం.. కానీ కొద్ది రోజులుగా వైన్స్‌షాపుల్లో ఐబీ(ఇంపీరియల్ బ్లూ) మద్యం నోస్టాక్ కనిపించడం వింతగా ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక మద్యం షాపుల్లో ఐబీ కొరత నెలకొనగా, బెల్ట్‌షాపుల్లో మాత్రం అందుబాటులో ఉండడంపై మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పాలకుర్తి మండలంలో నాలుగు వైన్స్ షాపులకు సర్కారు అనుమతినిచ్చింది. వైన్స్ షాపుల్లో అన్ని రకాల మద్యంతో పాటు బీర్లు కూడా దొరుకుతాయి..పోలీసుల నిర్లక్ష్యమో.. లేక ఎక్సైజ్ అధికారుల మామూళ్ల మత్తు దేవుడెరుగు గానీ గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు పుట్టుకొచ్చాయి. గల్లీ గల్లీకి ఓ బెల్ట్‌షాపు ఉంది. దీంతో వైన్స్ షాపు యజమానులు మద్యం కొరత సృష్టిస్తు కాసులు సంపాదిస్తున్నారు. సుమారు నెల రోజులుగా పాలకుర్తి మండల కేంద్రంలోని వైన్స్ షాపుల్లో ఐబీ మద్యం లభించడం లేదు. గ్రామాల్లో ఎక్కువ మంది ఐబీ ప్రియులే ఉంటారు. దీంతో వారికి ఈ బ్రాండు లభించకపోవడంతో బెల్ట్‌షాపులకు వెళ్తున్నారు. ఐబీతోపాటు బీర్ల కొరతను వైన్స్‌షాపు యజమానులు సృష్టిస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. బెల్ట్‌షాపుల్లో ఎక్కువ ధరకు వీటిని విక్రయించి అధిక లాభాలు సంపాదించేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మద్యం ప్రియులు మండిపడుతున్నారు. ఐబీ క్వాటర్‌కు వైన్స్‌షాపులో రూ.180 మాత్రమే. అదే బెల్ట్‌షాపులో రూ.220కి విక్రయిస్తున్నారు. వైన్స్‌షాపు నిర్వహకులు బెల్ట్‌షాపులకు రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. అంటే క్వాటర్‌కు వైన్స్ షాపులకు రూ. 20 లాభం రాగా, బెల్ట్‌షాపుల వారికి రూ. 20 లాభం వస్తోంది. దీంతో మద్యం ప్రియులు అదనంగా రూ. 40 అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. వైన్‌షాపుల యజమానులు కృత్రిమ కొరత సృష్టించడంపై మద్యం ప్రియులు మండిపడుతున్నారు.

ఐబీ మద్యం కొరత నిజమే..

– సంతోష్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, పాలకుర్తి

మద్యం షాపుల్లో ఐబీ క్వాటర్లు కొరత నిజమే. ఈ బ్రాండు మద్యం అంతగా రావడం లేదు. పాలకుర్తి మండలంలో నాలుగు మద్యం షాపులకు కేవలం నాలుగు పెట్టెలు మాత్రమే పంపుతున్నారు. ఇంపీరియల్ బ్లూ తగ్గినట్లే. ప్రభుత్వమే ఐబీ మందును పంపడం లేదు. దీంతో మేమేమి చేయలేము.

తెలంగాణ సాయుధ పోరులో పాండురంగం కీలకపాత్ర

పాండురంగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 23 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరుడు పొట్టబత్తిని పాండురంగం నిర్వహించిన పాత్ర మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. పాండురంగం 27వ వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. స్థానిక శ్రీనివాస నగర్‌లోని వారి కుమారుడు భాస్కర్ నివాసంలో పాండురంగం చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజా రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్మెట మండలం వెల్దండ కేంద్రంగా పొట్టబత్తిని పాండురంగం రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడినట్లు తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బూడిద గోపి, చింతకింది అరుణ, గుండు కనకయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని లక్ష్యయ్య, తాళ్లపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలపై పోరాటం

దేవరుప్పుల, ఫిబ్రవరి 23: ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకొస్తున్న చట్టాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గడ్డం సదానందం తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మతోన్మాదులకు వ్యతిరేకంగా ఈ నెల 28న తమ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని సదానందం విమర్శించారు. మాజీ గుమ్మడి నర్సయ్య లాంటి నేతలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

వివాహ వేడుకలకు హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఫిబ్రవరి 23: మండలంలోని నీర్మాలకు చెందిన గాదె మర్రెడ్డి కుమారుడు రాజీవ్‌రెడ్డి–బాల త్రేస వివాహం ఆదివారం జరిగింది. వివాహ వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పల్లా సుందరారెడ్డి, ఎడమ నర్సింహారెడ్డి, ఎన్నం చంద్రమౌళి, కొత్త జలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటలకు సాగునీరందించాలి

దేవాదుల రిజర్వాయర్ల ద్వారా పంటలకు సాగునీరందించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంబంధిత అధికారులను కోరారు. నీర్మాలకు ఆయన వచ్చిన సందర్భంఆ స్థానిక రైతులు ఎర్రబెల్లిని కలిసి పంటలు ఎండుతున్నాయని, దేవాదుల కాల్వల ద్వారా నీళ్లు వదిలేలా అధికారులతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన నీటిపారుదల శాఖ ఎస్ఈతో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫోన్లో మాట్లాడగా మూడు రోజుల్లో నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

మూఢనమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

న్నపెండ్యాలలో మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు, ఫిబ్రవరి 23 : మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు వాస్తవాలను వివరించాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా ఆదేశాల మేరకు మండలంలోని చిన్నపెండ్యాలలో ఆదివారం పోలీస్ కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్‌కుమార్ మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వాహనదారులు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బైక్‌పై ప్రయాణం చేసేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువత గంజాయి, గుట్కా, గుడుంబా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఏఎస్సై జయకుమార్ మాట్లాడుతూ ఊరు చివరన నివాసాలు ఉన్నవారు దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తే బంగారు, వెండి అభరణాలు, విలువైన వస్తువులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం ఏఎస్సై నాగమణి, హెడ్‌కానిస్టేబుల్స్, విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి, కానిస్టేబుళ్లు ఆర్ వీరన్న, శ్రీనాథ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాడు పాఠాలు బోధించిన గురువులతో బచ్చన్నపేటలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

19 ఏళ్ల అనంతరం కలుసుకున్న ఆత్మీయులు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 23 : పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా ఒక్క చోట చేరారు. 19 ఏళ్ల అనంతరం కలుసుకున్న వీరు నాడు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను, తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీవితంలో వచ్చే కష్టాలను నిచ్చెనలుగా మార్చుకుని ఎదగాలని సూచించారు. సమాజంలో మారుతున్న పరిస్థితుల బట్టి పిల్లల పెంపకం ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి లక్ష్యాలను సాధించాలని కోరారు. చిన్ననాడు చదువుకున్న బచ్చన్నపేట ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అందరూ చేయూతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, మురళి, రాజేందర్, హిమబిందు, పృథ్వీరాజ్, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రావు, బాలకిషన్, వెంకటేశ్వర్లు, సురేశ్‌బాబు, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్‌రెడ్డి, కవిత, రమేశ్‌రెడ్డి, షరీఫ్, నాగరాజు, సురేశ్, చంద్రశేఖర్, రామతార తదితరులు పాల్గొన్నారు.

కోమల్లలో రైలు ఢీకొని వ్యక్తి మృతి

రఘునాథపల్లి, ఫిబ్రవరి 23: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కోమల్ల రైల్వేగేట్ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురం మండలం చీటూరుకు చెందిన ఎర్ర ఎల్లేశ్(32) కోమల్లలో కన్నారపు యాదగిరి వద్ద కొంత కాలంగా పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేక పోవడంతో చీటూరుకు వెళ్లేందుకు ఆదివారం స్థానిక బస్టాండ్‌కు నడుచుకుంటు రైలు పట్టాలు దాటి వెళ్తున్నాడు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న రైలు ఢీ కొనడంతో ఎల్లేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనాస్థలం వద్దకు జీఆర్పీ పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

జనగామలోని గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

జనగామలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష

జిల్లాలో 1851 మంది అభ్యర్థులకు1800 మంది హాజరు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 23 : ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5, 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశం కల్పించడానికి ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడించారు. జిల్లాలోని తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష సజావుగా కొనసాగినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 1851 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1800 మంది హాజరైనట్లు తెలిపారు. మరో 51 మంది గైర్హాజర్ అయినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 97.24 హాజరుశాతం నమోదైనట్లు వివరించారు. ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా నోడల్ అధికారి విక్రమ్ పర్యవేక్షించారు.

ప్రవేశ పరీక్షకు 487 మంది హాజరు

కృతమూర్తి

స్టేషన్ ఘన్‌పూర్ : ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు 487 మంది విద్యార్థులు హాజరైనట్లు స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కృతమూర్తి తెలిపారు. ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ లో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్‌కు చెందిన 500 మంది విద్యార్థులను తమ పాఠశాలకు కేటాయించగా, వీరిలో 487 మంది ప్రవేశ పరీక్షకు హాజరైనట్లు కృతమూర్తి తెలిపారు. 5వ తరగతికి 188 మంది, 6వ తరగతికి 80, 7వ తరగతికి 82, 8వ తరగతి 84, 9వ తరగతికి 53 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. 19 గదుల్లో 22 మంది సిబ్బందితో పరీక్షను నిర్వహించామన్నారు. జిల్లా నోడల్ అధికారి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విక్రం పరీక్షలను పర్యవేక్షించారని వెల్లడించారు.

కొడకండ్లలో..

కొడకండ్ల : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతి అడ్మిషన్ కోసం జరిగిన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసిందని పరీక్షల చీఫ్ సూపరింటెండంట్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. మొత్తం 116 మంది విద్యార్థులకుగాను 115 మంది పరీక్షకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా జరిగాయని తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

పేదింటి పెళ్లికి ఎమ్మెల్యే పల్లా ఆర్థిక సాయం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 23 : మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబంలో తల్లిదండ్రులు లేని ఓ ఆడబిడ్డ పెళ్లికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు ఆదివారం బీఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.5 వేలు పంపించారు. ఆల్వాల మధు, కరుణ కొన్నేళ్ల క్రితం మృతి చెందగా వారి కూతురు ఇందు అనాథగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె వివాహానికి ఎమ్మెల్యే పల్లా ఆర్థిక సాయం అందించారని నాయకులు వెల్లడించారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఇందు వివాహానికి మండలానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త జంగిటి విద్యానాథ్ రూ.10 వేలు సాయం అందించారు. విద్యానాథ్ మాట్లాడుతూ పేదలకు సాయం అందించడంలో ఉన్న తృప్తి కోట్ల ఆస్తులున్నా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆల్వాల ఎల్లయ్య, కోడూరి మహాత్మాచారీ, పైసా రాజశేఖర్, నర్సింగరావు, రాజయ్య, గుర్రపు బాలరాజు, కూరాకుల సుభాష్, రమేశ్, రవి పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ అందుకుంటున్న పరకాల మణిశంకర్.

సీఏలో స్టేషన్‌ఘన్‌పూర్‌వాసికి గోల్డ్ మెడల్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 23 : స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన వ్యక్తి సీఏలో జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పరకాల శ్రీనివాస్, సుకుమారి దంపతుల కుమారుడు పరకాల మణిశంకర్ చార్టెట్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల జరిగిన ఆల్ ఇండియా టెస్ట్‌లో మణిశంకర్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఐసీఏఐ అధ్యక్షుడు సీఏ రంజిత్‌కుమార్ అగర్వాల్, ఐసీఏఐ ఉపాధ్యక్షులు సీఏ చరణ్‌జోత్ సింగ్ నందా చేతుల మీదుగా మణిశంకర్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా మణిశంకర్‌ను స్థానికులు, స్నేహితులు అభినందించారు.

మాజీ డీఈవో రాముకు ఇంక్రిమెంట్ నిలిపివేత

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 23 : జనగామ మాజీ డీఈవో కే రాముపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ఇంక్రిమెంట్‌ను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి, దివాకర్‌రెడ్డి, బీ చొక్కయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై ఈ నెల 3వ తేదీన ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయుడు అటెండెన్స్ రిజిస్టర్‌తో పాటు సర్వీస్ రిజిస్టర్‌లో ట్యాంపరింగ్ చేసిన విషయాన్ని డీటీఎఫ్ జిల్లా కమిటీ మాజీ డీఈవో రాముకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరిపిన రాము సదరు ఉపాధ్యాయుడితో పాటు పాఠశాల హెచ్ఎంకు అనుకూలంగా నివేదికను ఆర్‌జేడీకి పంపారని వెల్లడించారు. ఈ విషయంపై డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ జరిపిన సదరు అధికారులు డీఈవో రాముపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇంక్రిమెంట్‌లో కోత విధించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మాజీ డీఈవో రాము ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా డీఈవోగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మతిస్థితిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 23 : జనగామ రైల్వే స్టేషన్‌కు సమీపంలోని అయ్యప్ప గుడి దగ్గర ఆదివారం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుళ్లు రాఘవేందర్, నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలం ఎల్లంలకు చెందిన జంజాల స్వామి (38) పదేళ్లుగా మతి స్థిమితం లేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సికింద్రాబాద్ వైపు నుంచి జనగామకు వస్తున్న కాగజ్ నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి స్వామి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు మార్కెటింగ్ శాఖ

డైరెక్టర్‌కు టీఆర్‌లు అప్పగింత

నేడు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు టీఆర్‌లు అప్పగింత

కాశీబుగ్గ, ఫిబ్రవరి 23: ఇటీవల సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేసిన క్రమంలో రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాల ప్రకారం పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తాత్కాలిక సర్టిఫికెట్ జారీ చేశారు. అందులో అవకతవకలు జరిగాయని వరంగల్ రీజినల్ పరిధిలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి 15 రోజుల్లో వివరణతోపాటు సంబంధిత టెంపరరీ రిజిస్